క్లుప్తంగా

రేపటి నుంచి దోమల నివారణ మందు పిచికారీ

సీతంపేట: జూలై ఒకటో తేదీ నుంచి రెండో విడత దోమల నివారణా మందును గ్రామాల్లో పిచికారీ చేయనున్నట్లు మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కుశిమి, మర్రిపాడు, దోనుబాయి గ్రామాల పరిధిలో ఐఆర్ఎస్ 5 శాతం ఏసీఎం ద్రావణం పిచికారీ చేస్తామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినకుదమ 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ బి.శంకరరావు శనివారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తుండడంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సింగనాపురం, కుదమ, కుందరతిరువాడ, నీచుకువలస, గెడ్డతిరువాడ గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

సమ్మెలో పాల్గొంటాం..



పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

వీరఘట్టం: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జూలై 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెలో తాము కూడా పాల్గొంటున్నట్లు పారిశుద్ధ్య కార్మికులు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌ను కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పశుదాణా పంపిణీ



పశుదాణా అందజేస్తున్న పశువైద్యాధికారి మునికుమార్

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలో మండల పశువైద్యాధికారి ఎస్.మునికుమార్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి రైతులు తీసుకువచ్చిన మూగజీవాల ఆరోగ్యం పరీక్షించి, వివిధ సమస్యలతో బాధపడుతున్న వాటి కోసం మందులు ఉచితంగా అందజేశారు. అనంతరం పాడిరైతులకు పశుదాణా పంపిణీ చేశారు. పాలదిగుబడి పెంచేందుకు పశువులకు నాణ్యమైన దాణా పెట్టాలని పశువైద్యాధికారి తెలిపారు.

అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు..

భామిని: మండలంలోని లివిరి దళితుల పట్ల రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు ఆరోపించారు. లివిరిలో శనివారం దళితులతో సమావేశమై డీ పట్టా భూములపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 42 మంది దళితుల డీ పట్టా భూముల ఆక్రమణపై తహసీల్దార్‌కు గతంలో ఫిర్యాదు చేశామన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆక్రమణదారుడికి మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి గుజ్జి జనార్దన మాట్లాడుతూ.. దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పొట్నూరు బాలు, సవలాపురపు నానాజీ, అల్లాడ చిన్ని, పి.బాబురావుపాల్గొన్నారు.

రుచి, శుచి కలిగిన ఆహారమివ్వాలి

కొమరాడ: విద్యార్థులకు రుచి, శుచి కలిగిన ఆహారమివ్వాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరాతీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి ఆహారం అందివ్వాలని సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట తహసీల్దారు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

గరుగుబిల్లి: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు సూచించారు. మండలంలోని చినగుడబ గ్రామంలో శనివారం చేపట్టిన ఇంటింటి చెత్త సేకరణను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఇంటి వద్దకు వచ్చే గ్రీన్‌అంబాసిడర్లకు తడి,పొడి చెత్త వేర్వేరుగా అందించాలని చెప్పారు. అలాగే వర్షాకాలం నేపథ్యంలో ఇళ్ల పరిసరాల్లో వరదనీరు, మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి టి.భాస్కరరావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా అశ్విని

జియ్యమ్మవలస: పిప్పలబద్ర పంచాయతీ కార్యదర్శిగా అశ్విని నియమితులయ్యారు. కురుపాం మండలం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఈమె..పిప్పలబద్ర వెళ్లగా అక్కడి నుంచి ఆర్.సునీల్‌దేవ్ గుమ్మలక్ష్మీపురానికి బదిలీ అయినట్లు ఎంపీడీవో ధర్మారావు తెలిపారు.



పాలకొండ: ప్రత్యేక అలంకరణలో పూజలు అందుకుంటున్న జగన్నాథస్వామి



వీరఘట్టం : గుడించ మందిరంలో కొలువుదీరిన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి



భామిని: మత్స్యావతారంలో జగన్నాథుడు

జై జగన్నాథా..

జగన్నాథస్వామి రథోత్సవం రెండో రోజు కూడా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో శనివారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. పాలకొండలో ఆలయ ప్రధానార్చకుడు మఠం విశ్వనాథ్ దాస్, మఠం చక్రిల ఆధ్వర్యంలో.. వీరఘట్టంలో అర్చకుడు లింగరాజ్ రథో ఆధ్వర్యంలో..భామినిలో ప్రతాప్ సాహూ ఆధ్వర్యంలో విశేష పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోవడంతో ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం చోటుచేసుకుంది.

– పాలకొండ /వీరఘట్టం/భామిని

వెదలతో సిరుల జల్లు..

- వరి నాట్లకు ప్రత్యామ్నాయంగా వెదలు
- ఆసక్తి కనబరుస్తున్న రైతులు
- పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ

పాలకొండ రూరల్:

ప్రస్తుత వాతావరణ పరిస్థితిని ఆసరాగా చేసుకుని వరి సాగులో నారుమడులు వేయకుండా నేరుగా విత్తనాలు వేసే(వెద) విధానం రైతులు అనుసరిస్తున్నారు. వరుస ఉడుపులు వేసిన రైతులు విధానపరమైన మార్పులతో లాభం పొందవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. వెదల ప్రక్రియతో ఎకరాకు దాదాపు 12 నుంచి 15 కిలోల విత్తనాలు ఆదా చేయడంతో పాటు పెట్టుబడులు, సాగునీటి ఇబ్బందులు అధిగమించవచ్చు. పంట దిగుబడి సుమారు పది రోజుల ముందే చేతికొస్తుంది. నాట్లు వేస్తే సకాలంలో అందక ఇబ్బంది పడే అవకాశాలున్నాయి.



వెదలు జల్లెందుకు దుక్కు చేసిన వైనం



వీరఘట్టం రహదారిలో వరి వంగడాలను వెదలు జల్లుతున్న రైతులు

మన నేలలు అనుకూలం..

వెదలకు మన నేలలు అనుకూలం. వెద జల్లే ముందు భూమి సమాంతరంగా ఉండేలా దమ్ము చేయాల్సి ఉంటుంది. ఈ పద్ధతిలో సాంద్రత ప్రధానంగా ఉండేలా విత్తనాలు వేసుకోవాలి. మొదటి ఆకు విచ్చుకుని, పచ్చబడే వరకూ పొలంలో బురద పదును ఉండేలా చూసుకోవాలి. పలుచటి నీటి తడులు అందించాలి. 35 రోజుల తర్వాత ఓసారి నీటి తడులు అందాల్సి ఉంటుంది. సాధారణ పద్ధతిలో కలుపు నివారణ చర్యలు తీసుకోవాలి. ఈ విధానంలో నారు పెంచడం, ఆకు తీతలు, ఉడుపులు ఉండవు. దీంతో ఎకరాకు సుమారు రూ.5 వేల మేర పెట్టుబడి భారం తగ్గుతుంది.

నీటి యాజమాన్యం కీలకం..

ఈ విధానంలో నీటి యాజమాన్యం కీలకం. వెదలు వేసే పొలంలో నీటి నిల్వలు లేకుండా చూడాలి. నీరు నిలిస్తే మొలక శాతం తగ్గుతుంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సేద్యం చేయవచ్చు. ఈ పద్ధతి వల్ల పొలంలో మొక్కకు సూర్య రశ్మి, గాలి పుష్కలంగా సమకూరుతుంది. దీంతో చీడపీడల బెడద తగ్గి సస్యరక్షణ ఖర్చు తగ్గుతుంది. కిలో విత్తనాలకు ఒక గ్రాము బావిస్టిన్ పొడి లేక 3 గ్రాముల సూడోమోనస్ లీటర్ నీటిలో కలిపి 24 గంటల పాటు విత్తనాలు నానబెట్టాలి. తర్వాత మరో 24 గంటలు వాటిని గోనె సంచిలో వేసి మండికట్టిన తర్వాత వెద జల్లుకోవాలి. బంక నేలల్లో దమ్ము చేసిన మరుచటి రోజునే వెదజల్లాలి లేకుంటే డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేయవచ్చు. ఇసుక శాతం అధికంగా ఉండే నేలల్లో వెదలు వేసిన రోజే దమ్ము చేయాలి. తేలికపాటి నీటి తడులు అందించాలి. భూసార పరీక్షలకు అనుగుణంగా సీజన్‌లో నత్రజని, భాస్వరం, పొటాస్ వంటి ఎరువులను అధికారుల సూచన మేరకు మాత్రమే వాడాల్సి ఉంటుంది.

కలుపు యాజమాన్యం..

వెద జల్లిన 48 గంటల్లోపు కలుపు నివారణ నిమిత్తం పిండిమిథాలిన్ వేయాలి. 15 – 20 రోజుల మధ్య పొలంలో కలుపు ఎక్కువగా ఉంటే నీటి నిల్వలు లేకుండా చేసి సైహలోఫాస్ బ్యూటైల్ 400 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గడ్డి జాతి, వెడల్పు ఆకుల కలుపు లేదా రెండూ ఉన్నట్లు గుర్తిస్తే బిస్పైరిబాక్స్ సోడియం 100 – 120 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాల్సింటుంది. నెల రోజులకు వెడల్పు ఆకు కలుపు అధికంగా ఉంటే పొలంలో నీరు బయటకు పంపి (2–4డీ) సోడియం సాల్ట్ 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలపి పిచికారీ చేయాలి. పొలం ఎరుపు రంగులో కనిపిస్తే యూరియా తగు మోతాదులో వేయాలి. సన్నజాతి గడ్డి నివారణకు ఫీనాక్సీ-ప్రాప్-పి-ఇథల్ 6.9 శాతం 250 ఎంఎల్ 2 వందల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా సమర్థవంతంగా కలుపు నివారణ చేయవచ్చు.

రైతులకు లాభదాయకం..



వెదలు వేసే విధానం రైతులకు లాభదాయకం. సాగు నీటి ఇబ్బందులు, అధిక పెట్టుబడులు ఉండవు. ప్రకృతి వైపరిత్యాలను, చీడపీడల బెడదను తట్టుకుంటుంది. దిగుబడి పెరుగుతుంది. పంట కాలం తక్కువ. ఈ విధానాన్ని అవలంభించడం శ్రేయష్కరమే. ఇప్పటికే పలుచోట్ల రైతులు వెదలు వేశారు. వెదల సాగుపై రైతులకు గ్రామస్థాయిలో అవసరమైన సలహాలను వ్యవసాయ సహాయకులు అందిస్తున్నారు.

– కె.రత్నకుమారి, వ్యవసాయశాఖ ఎ.డి, పాలకొండ

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



పుష్పశ్రీవాణికి కృతజ్ఞతలు తెలుపుతున్న విజయ్‌కుమార్

జియ్యమ్మవలస రూరల్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం సెక్రటరీగా కురుపాం మండలంలోని పెదమేరంగి గ్రామానికి చెందిన రౌతు విజయ్‌కుమార్ నియమితులు కాగా ఆయన.. మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణిని చినమేరంగిలోని ఆమె నివాసం వద్ద శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని, ప్రజలంతా వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారన్నారు. మనమంతా పార్టీని మళ్లీ అధికారంలోకి తేవడమే లక్ష్యంగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు, మరడాన కిశోర్, రౌతు అజయ్‌కుమార్, వాసుదేవరావు, బలగ వెంకటరమణ, లోలుగు నారాయణరావు, శంకర్రావు, సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

పరామర్శ



టంకాల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస

పాలకొండ రూరల్: అందరితో సరదాగా ఉండే టంకాల దుర్గారావు మృధు స్వభావని, ఆయన మరణం తనను కలిచివేసిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. నగరంలోని చిన్నకాపు వీధిలో ఉన్న టంకాల స్వగృహానికి శనివారం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా టంకాలతో తనకున్న అనుబంధాన్ని విక్రాంత్ గుర్తు చేసుకున్నారు. పరామర్శలో కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, పల్లా భాను, తూముల లక్ష్మణరావు, కొరికాన గంగునాయుడుతో పాటు జల్లు నారాయణరావు, యందవ మరియదాసు, సుంకరి ధర్మారావు, పోమోటి వైకుంటరావు, విశ్రాంత తహసీల్దార్ నరసింహమూర్తి, తదితరులున్నారు. అంతకుముందు టంకాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉచిత న్యాయ సేవలు పొందవచ్చు

- జిల్లా అదనపు న్యాయమూర్తి వివేక్ ఆనంద్ శ్రీనివాస్



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయమూర్తి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీలు ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని జిల్లా అదనపు న్యాయమూర్తి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని సబ్‌జైల్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతూ.. కేసు పూర్వాపరాలపై ఆరా తీశారు. అనంతరం చట్టాలు, లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జైల్ సూపరింటెండెంట్ బి.జోగులుకు సూచించారు. ఈయన వెంట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు ఎం.శ్రీధర్, పాలకొండ మండల న్యాయసేవా సంఘ అధ్యక్షురాలు చందక హరిప్రియ, న్యాయవాదుల బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు ఎం.శ్యామ్యూల్, బి.రామ్మోహనరావు, ఆర్. సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రకృతి వ్యవసాయ స్టాల్ పరిశీలిస్తున్న రాహుల్ ఖురానా

సీతంపేట: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ రాహుల్ ఖురానా అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం డీఏ, పీఎం జన్‌మన్ పథకాల అమలు తీరును పరిశీలించడానికి సీతంపేట ఏజెన్సీలో రెండు రోజుల పర్యటనకు వచ్చారు. మొదటి రోజైన శనివారం సీది, గుమ్మడ గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోందన్నారు. ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం వివిధ డిపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ కుమార్, డీఈ సింహాచలం, ఎంపీడీఓ మిశ్రో, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓ రామకృష్ణ, సీడీపీఓ సిమ్మాలమ్మ , హౌసింగ్ ఏఈ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు అందజేత



గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ

కొమరాడ: ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీఏసీఎస్ ఆవరణలో లీ ఫార్మా లిమిటెడ్, దీక్ష మహిళా వెల్ఫేర్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ హాజరై, గర్భిణులకు కిట్లు పంపిణీ చేశారు. ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉంటే రక్తహీనత నుంచి దూరంగా ఉండొచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ పీడీ టి.కనకదుర్గ, నాబార్డు డీడీఎం ఎస్.దినేష్‌కుమార్ రెడ్డి, లీ ఫార్మా లిమిటెడ్ డైరెక్టర్ ఎ.లీలారాణి పాల్గొన్నారు.

వెలుగులో చీకటి కోణం



దశుమంతపురం వీఓఏపై విచారణ చేపడుతున్న వెలుగు సిబ్బంది

- గ్రామ సంఘ సహాయకురాలిపై విచారణ
- స్త్రీ నిధి డబ్బుపక్కదోవ పట్టించిన వైనం

వీరఘట్టం: మండలంలోని దశుమంతపురం గ్రామానికి చెందిన గ్రామ సంఘ సహాయకురాలిని (వీఓఏ) విధుల నుంచి తొలగించాలని గ్రామ సంఘాలకు సూచించామని వెలుగు ఏపీఎం కె.రాము తెలిపారు. గ్రామానికి చెందిన వీఓఏ లక్ష్మి డ్వాక్రా సంఘ సభ్యుల నుంచి వసూలు చేసిన సుమారు రెండు లక్షల రూపాయలను సొంత అవసరాలకు వాడుకున్నట్లు ఆరోపణలు రావడంతో శనివారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ విచారణలో వసూలు చేసిన సొమ్ము సొంతానికి వాడుకున్నట్లు తేలిందని చెప్పారు. ఆరు నెలల కిందటే ఈమెపై ఆరోపణలు రాగా... సొమ్ము బ్యాంకులో గ్రామ సంఘాల ఖాతాకు జమ చేయాలని చాలాసార్లు సూచించామన్నారు. అయినప్పటికీ ఆమెలో మార్పు రాకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని తెలిపారు. ఆమెను విధుల నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. విచారణలో సీసీ ఆనందరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా రేపు

సీతంపేట: ఈ నెల 30న స్థానిక ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సన్ రైజ్ వర్క్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో బెంగుళూరుకు చెందిన ఇండోమిమ్, ఆదిత్య, ముషాషి కంపెనీలు వివిధ పోస్టులకు ఇంటర్వ్యూలు చేపడతారని పేర్కొన్నారు. ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెకానిక్, డీజిల్, వెల్డర్, మోటార్ వెహికల్ ట్రేడ్‌లలో ఉత్తీర్ణులైనవారు, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారు అర్హులన్నా రు. విద్యార్థతల ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 94938 17472 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

జూలై 1న జాబ్‌మేళా

గుమ్మలక్ష్మీపురం: సీతంపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జూలై 1వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు భద్రగిరి ఆర్ఐటీఐ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. బెంగళూరుకు చెందిన సన్‌రైజస్ వర్క్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ జాబ్‌మేళా నిర్వహిస్తోందని, ఐటీఐలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెకానిక్ డీజిల్, వెల్డర్, మెకానిక్(మోటార్ వెహికల్) ట్రేడ్‌లలో ఉత్తీర్ణులైన వారు, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారంతా బయోడేటా, టెన్త్ మార్క్‌లిస్ట్, ఐటీఐ పాసైన ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 6304086821, 9493128352 సంప్రదించాలని కోరారు.

నియామకం

గుమ్మలక్ష్మీపురం: ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శిగా పాలక రంజిత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు శికరం నరహరి నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన శనివారం తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు సూచించారు. కురుపాం మండలంలోని గుజ్జిపాడు గ్రామాన్ని శనివారం సందర్శించిన ఆయన గ్రామస్తులతో సమావేశమై, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ మాట్లాడవద్దని, బ్యాంకు వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. పొరపాటున ఫోన్‌లో ఓటీపీ చెప్పినట్లయితే ఖాతాలో ఉన్న నగదును ఖాళీ చేస్తారన్నారు. మైనర్లకు నడిపేందుకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. మందు తాగి వాహనం నడిపినా, హెల్మెట్ ధరించకపోయినా ప్రమాదం జరిగితే చనిపోయే అవకాశం ఉందన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఉన్నతమైన జీవనం సాగించాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని టిక్కబాయి గ్రామంలో డీఏ జుగా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎంపీడీవో పి.త్రివిక్రమరావు ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రజలు సమర్పించిన వినతిపత్రాలు స్వీకరించారు. రేషన్‌కార్డులు, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, తాగునీటి ట్యాంకు, సెల్‌టవర్, బస్‌షెల్టర్‌ల నిర్మాణానికి గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

జియ్యమ్మవలస: సమస్యల పరిష్కారమే డీఏ జుగా కార్యక్రమ లక్ష్యమని ఎంపీపీ సురేష్ తెలిపారు. మండలంలోని చినతోలుమండగూడలో శనివారం గ్రామసభ నిర్వహించి, గ్రామస్తుల సమస్యలపై ఆరాతీశారు. సమస్యలు లేని గిరిజన గ్రామాలను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలమెట్టలో ఏం జరుగుతోంది...

- గ్రామాన్ని చుట్టుముట్టిన పోలీసులు



పాలమెట్ట గ్రామంలో పోలీసులు

వీరఘట్టం:

మండలంలోని పాలమెట్ట గ్రామాన్ని మూడు రోజులుగా జలవనరులశాఖ అధికారులు, పోలీసులు చుట్టుముడుతుండడంతో ఏం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 26న పాలమెట్ట – నీలానగరం ఓపెన్ హెడ్ చానల్‌కు నాగావళి నది నుంచి నీరు అందించే బొడ్డగెడ్డ వద్ద టెంకాయ కొట్టేందుకు ఎమ్మెల్సీ విక్రాంత్ రైతులతో కలసి రావడంతో సుమారు 130 మంది పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టారు. అలాగే శనివారం కూడా జలవనరులశాఖ అధికారులు, కూటమి నాయకులతో కలిసి అదే చానల్ వద్ద జేసీబీతో పనులు చేసేందుకు రావడంతో పెద్ద ఎత్తున పోలీసు బలగాలు పాలమెట్ట గ్రామానికి చేరుకున్నాయి. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే గ్రామానికి ఇంత పెద్ద సంఖ్యలో పోలీసులు వస్తుండడంతో ఎప్పుడు, ఏం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. చానల్‌లో పనులు చేద్దామని అధికారులు శనివారం వచ్చినప్పటికీ కాలువలో నీరు ఎక్కువగా ఉండడంతో పనులు చేపట్టలేదని జలవనరుల శాఖ ఏఈ డీవీ రమణ తెలిపారు.

150 ఏళ్లుగా..

నాగావళి నదీ తీరాన ఉన్న పాలమెట్ట గ్రామం నుంచి ఓపెన్ హెడ్ చానల్ ద్వారా మండలంలోని బిటివాడ, కుమ్మరిగుంట, ఎం.వి.పురం, నీలానగరం, పనసనందివాడ, తలవరం గ్రామాల్లోని సుమారు 2500 ఎకరాల ఆయకట్టుకు 150 ఏళ్లుగా సాగునీరు సరఫరా అవుతోంది. ప్రతి ఏటా ఈ ప్రాంత రైతులు సంయుక్తంగా కాలువ పనులు చేసుకుంటున్నారు. ఈ ఏడాది కూడా ఆయా గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు ఇటీవల నీలానగరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ ఖరీఫ్‌లో పాలమెట్ట ఓపెన్ హెడ్ చానల్ ద్వారా తమ పంట పొలాలకు నీరందించే బాధ్యతను ఓ వ్యక్తికి అప్పగించారు. ఖరీఫ్ చివరి వరకు నీటి పంపిణీని ఆయనే పర్యవేక్షిస్తారు. ఇలా ప్రతి ఏటా ఓ వ్యక్తిని నియమించుకుని ఆయా గ్రామాల రైతులు పాలమెట్ట ఓపెన్ హెడ్ చానల్ సాగునీటి ద్వారా ఖరీఫ్‌లో సాగుకు సిద్ధమవుతుంటారు. అయితే ఈ ఏడాది కూటమి నాయకులు రూ.11.15 లక్షల ఓఅండ్ఎం నిధులతో ఈ చానల్‌లో పూడికలు తీయిస్తున్నారు. జలవనరులశాఖ అధికారులు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. అయితే జలవనరులశాఖ అధికారులు చేయిస్తున్న ఈ కాలువ పనుల వల్ల తమ పంట పొలాలకు నీరు వచ్చే పరిస్థితి లేదని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. అందుచేతనే ఆయకట్టుదారుడైన ఎమ్మెల్సీ విక్రాంత్‌తో కలసి ఈ చానల్‌ను బాగుచేస్తామని ఇటీవల రైతులు బహిరంగంగానే ప్రకటించారు.

ఈ నేపథ్యంలో ఇటు వైఎస్సార్‌సీపీ నాయకులు, మరో పక్క కూటమి నాయకులు కాలువ వద్దకు వస్తుండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పాలమెట్టలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు.